సాక్షి ఒడిశా

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.00.970లు, బంగారం 2గ్రాముల 550 మిల్లీగ్రాములు వెండి 38 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఢిల్లీ చేరిన పోలవరం పంచాయితీ

ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్ట్‌పై ప్రతిపక్ష బిజూ జనతా దల్ పార్టీ తన అసమ్మతిని ఢిల్లీకి వినిపించింది. పార్టీ సీనియర్ నాయకుడు దేవి మిశ్ర నేతృత్వంలో బృందం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

- 8లో.



పెద్దపులి కలకలం

గజపతి జిల్లా గుసాని సమితి శోబర పంచాయతీలో ఆవును పెద్ద పులి తినేయడంతో స్థానికంగా కలకలం రేగింది. ప్రస్తుతం రామచంద్రపూర్, కన్నెపదర్‌లో పులి తిరుగుతున్నట్టు అటవీ అధికారులు తెలిపారు.

- 8లో.

న్యూస్‌రీల్

వ్యాపారి బలవన్మరణం



వెంకటేశ్వర్ (ఫైల్)

కొరాపుట్: ఉరి వేసుకొని వ్యాపారి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నబరంగ్‌పూర్ జిల్లా పపడి హండి పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. పపడాహండి సమితి కేంద్రంలో భవానిపట్న రోడ్డులో గుడ్ల వెంకటేశ్వర్ (వెంకన్న) (60) తన షాపులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు చెప్పారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పపడాహండి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

శ్లాబ్ కూలి బాలుడు మృతి



మహేశ్వర్ గౌడ మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొరాపుట్: శ్లాబ్ కూలి బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితి కేంద్రం హాత పాద వీధిలో గురువారం చోటుచేసుకుంది. పాడుబడిన ఇంటి మీద నుంచి పక్కనే ఉన్న సెల్‌ఫోన్ టవర్ రాడ్లను తీయడానికి పిల్లలు మహేశ్వర్ గౌడ (12), ఉమా గౌడ ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే వారు నిల్చున్న శ్లాబ్ కూలిపోగా.. వీరిద్దరూ శిథిలాల కింద ఉండి పోయారు. స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా.. సిబ్బంది వచ్చి శిథిలాల నుంచి పిల్లలను వెలికి తీశారు. అయితే అప్పటికే మహేశ్వర్ గౌడ మృతి చెందాడు. ఈ ఘటనతో స్థానికంగా విషాదం అలముకుంది.

'సుభద్ర' కోసం రాస్తారోకో



ఆందోళన చేస్తున్న మహిళలు

పర్లాకిమిడి: సుభద్ర పథకం వర్తించకపోవడంతో ఆగ్రహం చెందిన మహిళలు అంగన్‌వాడీ కార్యకర్తను స్తంభానికి కట్టేసి రాస్తారోకో చేపట్టారు. ఈ ఘటన రాయఘడ బ్లాక్ హత్తిబడి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఖాతాల్లో ఏడాదికి ఐదు వేల రూపాయలు చొప్పున వేసే సుభద్ర పథకం డబ్బులు గ్రామంలో ఎవరికీ రాలేదు. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోను చేయగా లబ్ధిదారుల పేరిట రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని తెలియడంతో అనర్హులుగా ప్రకటిస్తున్నట్లు తేలింది. దీనికి ఆగ్రహం చెందిన గ్రామ మహిళలు సంబంధిత అంగన్‌వాడీ వర్కర్‌ను విద్యుత్ స్తంభానికి కట్టేసి రహదారిపై ఆందోళనకు దిగ్గారు. ఈ ఘటనలో పర్లాకిమిడి–రాయఘడ– ఆర్.ఉదయగిరి– మోహనా–బరంపురం దారిలో ఇరువైపులా గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ధర్నా విరమింపజేశారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులతో పోలీసులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి గోరియగూడ సమీపంలోని చెరువులో ఈ నెల 2న లభ్యమైన మంగళ కవాసి మృతదేహం లభ్యమైంది. అయితే మంగళ హత్యకు గురైనట్లు సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గొడిగూడ పంచాయతీ కోటిల్‌గూడ గ్రామానికి చెందిన జితేన్ మడియమి, గంగా సోడి, పూర్ణామ మద్కమిలను నిందితులుగా గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. తాటిచెట్టు కోసం మంగళను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని జిల్లా అదనపు ఎస్పీ తపాన్ నారాయణ రోత్, ఎస్‌డీపీఓ సీన్ పటేల్ తెలిపారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపరిచామని చెప్పారు.

పరిశోధనలతోనే పరిష్కారం



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



గౌరవ డాక్టరేట్ అందుకున్న మిల్లెట్ రాణి

- వ్యవసాయానికి వాతావరణ మార్పులే పెను సవాలు
- వినూత్న పరిశోధనలకు యువత ముందుకు రావాలి
- ఓయూఏటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము

భువనేశ్వర్ : వాతావరణ మార్పు, వనరుల దుర్వినియోగం భారత వ్యవసాయ రంగానికి పెను సవాలుగా నిలుస్తున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి యువ వ్యవసాయవేత్తలు పరిశోధనలకు నడుం బిగించాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఒడిశా వ్యవసాయ సాంకేతిక విశ్వ విద్యాలయం ఓయూఏటీ 40వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ రంగం, రైతాంగం సాధికారితతో మాత్రమే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. వ్యవసాయం, మత్స్య ఉత్పాదన, పాడి పశువుల అభివృద్ధి వంటి అనుబంధ రంగాల అభివృద్ధి జాతి ఆర్థిక పురోగతికి బలమైన సోపానాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావాలు తలసరి వ్యవసాయాన్ని తగ్గిస్తున్నాయని చెప్పారు. సహజ వనరుల సద్వినియోగం దారి తప్పడం మరో ఘోర విపత్తుగా వ్యవసాయ రంగాన్ని కుంగదీస్తోందన్నారు. ఈ పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు భారతీయ శాస్త్రవేత్తలు సకాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యవంతమైన నేల, మట్టి నాణ్యత మెరుగుదల, సహజ వనరుల సద్వినియోగం విస్తృతపరచాల్సి ఉందన్నారు. ఉష్ణోగ్రతల అసమతుల్యం, వాయు కాలుష్యం వంటి వాతావరణ మార్పులు వ్యవసాయ ఉత్పత్తిని ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. సాగు కార్యకలాపాల్లో రసాయన ఎరువుల వినియోగం, క్రిమి సంహారక మందుల ప్రయోగం వంటి వైపరీత్య చర్యలు నేల, మట్టి, నీరు వంటి సహజ వనరుల్ని కలుషితం చేయడంతో వ్యవసాయంపై ఆధారపడే బహుముఖ వర్గాల్ని విపరీతంగా ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు..

స్నాతకోత్సవం విద్యార్థుల ఆశాజనక భవిష్యత్తుకు బాటలు వేస్తుందని రాష్ట్రపతి అన్నారు. వ్యవసాయ రంగంలో విద్యాధికులుగా ఉత్తీర్ణత సాధించి భిన్నమైన పర్యావరణ వ్యవస్థలోకి అడుగుపెట్టే శుభ సమయంగా పేర్కొన్నారు. సృజనాత్మకతతో పనిచేసిన ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వినూతన ఆలోచనలు, అంకిత భావంతో 2047 సంవత్సరం నాటి శతాబ్ది స్వతంత్ర భారత దేశం ఆవిష్కర్తలుగా నిలవాలని ప్రోత్సహించారు. ఆహార ధాన్యాల కోసం పొరుగు దేశాలపై ఆధార పడిన భారత దేశం నేడు ఇరుగు పొరుగు ప్రపంచ దేశాలకు వ్యవసాయ ఉత్పాదనలు ఎగుమతి చేసి ఆదుకునే స్థాయికి ఎదగడం గర్వ కారణమని రాష్ట్రపతి తెలిపారు. అనంతరం 725 మంది పట్టభద్రులకు పట్టాలు, 480 మంది పోస్టు గ్రాడ్యుయేట్లకు డిగ్రీలు, 118 మందికి పీహెచ్‌డీ డిగ్రీలు, 117 మందికి బంగారు పతకాలు, నలుగురికి డాక్టరేట్లు ప్రదానం చేశారు.

పలువురికి డాక్టరేట్లు

ఆటమిక్ ఎనర్జీ కమిషన్ అధ్యక్షుడు, విభాగం కార్యదర్శి అజిత్ కుమార్ మహంతి, అమెరికా ఎన్ఐఎఫ్ఏ డైరెక్టర్ మంజిత్ మిశ్రా, నేషనల్ అకాడమీ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అధ్యక్షుడు ప్రకాషరావు, వెంకటరమణ దువ్వూరి, ఒడిశా మిల్లెట్ రాణిగా సుపరిచిత రాయిమతి ఘివురియా డాక్టరేట్లు సాధించారు.

మిల్లెట్ రాణికి డాక్టరేట్..

దేశంలో మిల్లెట్ రాణిగా పేరొందిన రాయిమతి ఘివురియా కొరాపుట్ జిల్లా కుంద్రా గ్రామంలో దళిత మహిళా రైతు. పురాతన సస్య విత్తనాల సంగ్రహకర్తగా ప్రత్యేక గుర్తింపు సాధించారు. జి – 20 ఫేమ్ ఆమె సొంతం చేసుకుంది. మిల్లెట్ విత్తనాల సాగు పట్ల ప్రేరణాత్మక శక్తిగా వెలుగొందుతున్నారు. తాజాగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా గౌరవ డాక్టరేటు పొందడం విశేషం. రాష్ట్ర గవర్నర్, ఓయూఏటీ చాన్సలర్ రఘుబర దాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయం, రైతు సాధికారిత విభాగం మంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసరు ప్రభాత్ కుమార్ రవులో, అకడమిక్ మండలి సభ్యులు, డీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఫుట్‌బాల్ పోటీలో తలపడుతున్న కొరాపుట్, బొయిపరిగుడ టీమ్‌లు

హోరాహోరీగా..

- విక్రమ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

జయపురం: విక్రమదేవ్ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ గురువారం విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో ప్రారంభమైంది. విశ్వవిద్యాలయంలో మొదటిసారి జరుగుతున్న టోర్నమెంట్‌ను వర్సిటీ రిజిస్ట్రార్ రంజన్ కుమార్ ప్రధాన్ ప్రారంభించారు. మొదటి రోజున జరిగిన నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. మొదట మ్యాచ్ కొరాపుట్ కళాశాల, బొయిపరిగుడ సాహిద్ లక్ష్మణ నాయక్ కళాశాల జట్లు తలపడ్డాయి. కొరాపుట్ 3 గోల్స్ చేసి బొయిపరిగుడను ఓడించింది. రెండో మ్యాచ్‌లో నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ గురుకృప సైన్స్ డిగ్రీ కళాశాలతో ధ్రాడ కళాశాల టీమ్ తలపడింది. ధ్రాడ టీమ్ 3–0 గోల్స్‌తో ఉమ్మరకోట్ టీమ్‌ను ఓడించింది. మూడో మేచ్‌లో సునాబెడ ఏరోనాటిక్స్ కళాశాల టీమ్, మల్కనగిరి మోడల్ కళాశాల జట్లు తలపడ్డాయి. సునాబెడ టీమ్ 3–0 గోల్స్‌తో మల్కనగిరి టీమ్‌ను ఓడించింది. నాల్గో మ్యాచ్‌లో సెమిలిగుడ కళాశాల, నవరంగపూర్ కళాశాల టీమ్‌లు తలపడ్డాయి. సెమిలిగుడ టీమ్ 5–0 గోల్స్‌తో నవరంగపూర్ టీమ్‌పై విజయం సాధించింది.



మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రష్మీరంజన్, కుహోరో

రాయగడ: రెండు చోరీ కేసులకు సంబంధించి నిందితులను సదరు పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఎస్‌డీపీఓ రస్మీరంజన్ సేనాపతి, ఐఐసీ కె.కె.బి.కె.కుహోరా తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న చందిలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనార గౌడావీధిలో నివాసముంటున్న రాజేంద్ర ప్రసాద్ మిశ్రో ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడ్డారు. బీరువాలను విరగ్గొట్టి రూ.పది వేల నగదు, బంగారు ఆభరణాలను చోరీ చేశారు.కేసు నమోదు చేసిన పోలీసులు బరిపద గ్రామానికి చెందిన అఖిల్ మహారణ అనే నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఆరు బంగారు ఉంగరాలు, మూడు బంగారు గొలుసులు, మూడు బంగారు లాకెట్లు, రెండు జతల చెవిదిద్దులు, ఆరు వెండి పట్టీలు, వెండి తాళం, రెండు వెండి ఉంగరాలు, రూ.5300 నగదు స్వాధీనం చేసుకున్నారు.

బైకు దొంగతనం కేసులో...

స్థానిక గోదావరినగర్ రెండో లైన్‌లో నివాసముంటున్న రబి నారాయణ రథ్ నవంబరు 25న స్థానిక రైల్వేస్టేషన్ వద్ద బైక్ పార్కింగ్ చేసి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైకు కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా నాగ్‌పూర్‌కు చెందిన నందకిశోర్ సుఖచంద్ ఖాత్రే, రాయగడ జిల్లా గుడారి ప్రాంతానికి చెందిన బలియా బిడిక, పద్మపూర్‌కు చెందిన ఇస్మాయిల్ గంటలను అరెస్టు చేశారు. నిందితుడు నందకిశోర్ చోరీ చేసిన బైకులను తక్కువ ధరకు విక్రయిస్తుంటారని తమ దర్యాప్తులో తేలినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడు బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

నోటికి ప్లాస్టిక్ చుట్టేసి.. గోనెసంచిలో కట్టేసి..

- హాస్టల్ పైకప్పుపై దారుణ పరిస్థితిలో విద్యార్థిని
- విచారణ చేపట్టిన అధికారులు



గోనె సంచిలో బాలిక

జయపురం: జయపురం సమితి ఉమ్మిరి గ్రామ పంచాయతీ మొకాపుట్ ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇక్కడి హాస్టల్లో 8వ తరగతి చదువుతున్న పదమూడేళ్ల విద్యార్థినిని నోటికి ప్లాస్టర్ చుట్టి, కాళ్లు చేతులు కట్టి గోనె సంచిలో చుట్టేసి హాస్టల్ పైకప్పుపైకి విసిరేశారు. ఈ దారుణ ఘటన ఎవరు, ఎందుకు చేశారో తెలియలేదు. రెండు రోజుల కిందట జరిగిన ఈ ఘటన తాజాగా వెలుగుచూడటంతో విద్యార్థిని తండ్రి, గ్రామస్తులు బుధవారం సాయంత్రం జయపురం సదర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. ఓ పురుషుడు, ఓమహిళ ఈ దారుణ ఘటనకు పాల్పడినట్లు బాధితురాలి తండ్రి చెబుతున్నారు. పోలీసులు మాత్రం దర్యాప్తు పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని చెబుతున్నారు.

కోర్టు ప్రాంగణంలో పాము కలకలం



పామును పట్టుకుంటున్న స్నేక్ హెల్ప్‌లైన్ ప్రతినిధి

భువనేశ్వర్: స్థానిక జ్యుడిషియల్ కాంప్లెక్స్ ప్రాంగణంలో గురువారం ఉదయం నాగుపాము కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థ ప్రతినిధి బృందం రంగంలోకి దిగి రెండు అడుగుల నాగుపామును చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

సాంకేతిక సాగుతో అధిక దిగుబడులు



యంత్ర పరికరాల మేళాను ప్రారంభిస్తున్న సెంచూరియన్ వర్శిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు

పర్లాకిమిడి: ప్రస్తుత వ్యవసాయ విధానంలో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, సాంకేతికత అందిపుచ్చుకుంటేనే రైతులు అభివృద్ధి సాధించగలరని సెంచూరియన్ వర్శిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో గురువారం జిల్లా స్థాయి వ్యవసాయ యంత్ర మేళా నిర్వహించారు. మూడో రోజు కార్యక్రమానికి అతిథులుగా అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, ముఖ్య ప్రాణిచికిత్సా అధికారి తుషార్ రంజన్ సాహు, జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి ఏ.రాంప్రసాద్ పాత్రో, ఉప సంచాలకులు, ఉద్యానవన శాఖ సుశాంత్ రంజన్‌దాస్, జిల్లా వ్యవసాయ కార్మిక మోర్చా అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ పాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.ఎస్.రావు మాట్లాడుతూ ట్రాన్స్‌ప్లాంటర్, హార్వెస్టర్, వైడర్, రిఫర్, గొప్పితీత యంత్రాలు రైతులకు లాభదాయకంగా మారుతాయని చెప్పారు. సెంచూరియన్ వర్శిటీకి తొలిసారిగా 2008–09లో వరికోత, ట్రస్సర్ యంత్రాలు ప్రయోగాత్మకంగా తీసుకువచ్చామని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులకు 50, 70 శాతం రాయితీలతో ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు లభిస్తున్నాయని చెప్పారు. సెంచూరియన్ వర్శిటీని రైతులు సందర్శించి తక్కువ భూమితో ఆధునిక సాంకేతికతతో డచ్ రోజస్, కేసరి, వాణిజ్య పంటలు ఎలా పండిచవచ్చో తెలుసుకోవచ్చన్నారు. రైతులు తొలుత వ్యవసాయ యంత్రాలు కొనుగోలు చేసి వినియోగించిన తర్వాత ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని ఉద్యానవన శాఖ, ఉపసంచాలకులు సుశాంత రంజన్ దాస్ వివరించారు. అటవీ భూపట్టాలు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందని జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి రాంప్రసాద్ పాత్రో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ వ్యవసాయాధికారి శుభాశ్రీ ప్రియదర్శిని, గుమ్మా, ఆర్.ఉదయగిరి, గుసాని సమితిలకు చెందిన 30 మంది రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయ మేళాలో ఆధునిక యంత్రాలు

ఉత్సాహం ఉత్సవమై..

- చిత్రకొండ సమితిలో ఘనంగా మాల్యవాంత్ ఉత్సవాలు
- అలరించిన కళాప్రదర్శనలు



కళాకారుల నృత్య ప్రదర్శన

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితిలో సమితి స్థాయి మాల్యవాంత్ ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. చిత్రకొండ ఎమ్మెల్యే మాంగుఖీలో, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సమారి టాంగులు, సమితి సభ్యరాలు రాజేశ్వరీ ఖీలోలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 18 పంచాయతీల సర్పంచ్‌లు హాజరయ్యారు. సంప్రదాయబద్ధంగా విద్యార్థులు చేసిన ఒడిస్సీ నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అలాగే బాలీవుడ్ గాయకుడు కృష్ణబ్యూరో, హాలీవుడ్ గాయని నేహ నిహారిక దాస్ పాటలు, కామిడీ కింగ్ యోగేష్ జోజో హాస్యం ఆహుతులను అలరించింది. ఐఐసీ ముకుందో మేల్క శాంతిభద్రతలకు విఘాతం లేకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



వేదికపై అతిథులు



చిత్రకొండ వీధుల్లో కలశాలతో మహిళలు



శివతాండ విన్యాసం

క్లుప్తంగా

రైలులో వెండి అక్రమ రవాణా


స్వాధీనం చేసుకున్న వెండి

భువనేశ్వర్: రైలులో అక్రమంగా వెండిని రవాణా చేస్తున్న ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీ ప్రాంతానికి చెందిన చందన్ కుమార్‌ను అధికారులు పట్టుకున్నారు. రౌర్కెలా రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇతని నుంచి 60 కేజీల వెండిని స్వాధీనం చేసుకున్నారు. కొనుగోలుకు సంబంధించి సదరు వ్యక్తి చూపిన పత్రాలకు, వెండికి భారీ వ్యత్యాసం ఉండటంతో అదుపులోకి తీసుకున్నట్లు రౌర్కెలా ద్రవ్య సేవా పన్ను విభాగం డిప్యూటీ కమిషనర్ జగదీష్ చంద్ర సాహా తెలిపారు.

రామచంద్రపూర్‌లో పెద్దపులి కలకలం


అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమతి శోబర పంచాయతీలో ఆవును పెద్ద పులి తినేయడంతో స్థానికంగా కలకలం రేగింది. ప్రస్తుతం మహేంద్రగిరి అటవీ ప్రాంతం రామచంద్రపూర్, కన్నెపదర్‌లో పులి తిరుగుతున్నట్టు అటవీ అధికారులు తెలిపారు. డీఎఫ్‌ఓ ఎస్.ఆనంద్ ఆదేశాల మేరకు రామచంద్రపూర్, కన్నెపదర్ గ్రామాల్లో గురువారం పులి సంచారంపై కోయిపూర్, మహేంద్రగిరి అటవీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి వేళ గ్రామస్తులు ఒంటరిగా బయట తిరగవద్దని సూచించారు. మేకలు, ఆవులను మందకు తీసుకెళ్లకుండా ఇంటి కట్టాలని చెప్పారు.

కారులో మంటలు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భువనేశ్వర్: కారులో ఆకస్మాత్తుగా మంటలు రేగిన ఘటన కలకలం సృష్టించింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు సకాలంలో బయటకు రావడంతో ప్రాణ హాని తప్పింది. ఇందులో రాష్ట్ర సమాచార కమిషనరు రిజిస్ట్రార్, డ్రైవరు ప్రయాణిస్తున్నారు. 16వ నంబరు జాతీయ రహదారిపై కల్పనా కూడలి పంథ్ నివాస్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కారు ముందు భాగం మంటల్లో కాలిపోయింది. అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు


వేదికపై బాగ్, సరస్వతి, నాయక్ తదితరులు

రాయగడ: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు రావాలంటే సేంద్రియ ఎరువులనే వినియోగించాలని వాటర్‌షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్ అన్నారు. స్థానిక వాటర్‌షెడ్ సమావేశ మందిరంలో గురువారం ప్రపంచ సోయిల్ డే సందర్భంగా రైతులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ నిపుణులు సూచించే విధంగా తక్కువ మోతాదులో ఎరువుల వినియోగం అదీ సేంద్రీయ ఎరువులు వాడితే అధిక దిగుబడి సాధించడంతో పాటు భూమి సారాన్ని కోల్పోదని వివరించారు.అనంతరం చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సీడీవీఓ దేవరాజ్ నాయక్, ఉద్యానవన డిప్యూటీ డైరెక్టర్ దయానిధి రౌత్, ఏడీఓ గుణుపూర్ బృందావన్ బెహరా, బిష్ణు ప్రసాద్ కర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడి(60) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు గత కొద్ది రోజులుగా టెక్కలి పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా తిరుగుతుండగా స్థానికులు సపర్యలు చేసి టెక్కలి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అయితే ఆస్పత్రిలో ఆ వృద్ధుడు గందరగోళం సృష్టించి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం రెండు రోజుల తర్వాత ఆస్పత్రి సమీపంలో ఈవిధంగా మృతి చెంది ఉండడం స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, ఆ వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. అయితే మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియలేదని, ఎవరికైన తెలిసినట్లైతే టెక్కలి పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

న్యాయసేవలు.. సామాన్యులకూ చేరువ కావాలి

- జ్యుడీషియల్ కోర్టు సముదాయం ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


వేదికపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అతిథులు

భువనేశ్వర్: సామాన్య పౌరునికి భారత న్యాయ వ్యవస్థ సేవలు చేరువ కావాల్సి ఉందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, చట్టపరమైన సంస్థలు, వర్గాలతో సామాన్య పౌరులు సైతం చనువుగా మెలిసేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని ప్రతిపాదించారు. భువనేశ్వర్ నగరంలో కొత్తగా నిర్మించిన జ్యుడీషియల్ కోర్టు భవన సముదాయం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయం కోసం తాపత్రయ పడే సామాన్య పౌరులు చట్టపరమైన సంబంధిత వ్యవస్థలో సంబంధిత వర్గాలతో స్వేచ్ఛగా సంప్రదించగలిగే వాతావరణం అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మితమైన జుడిషియల్ భవన సముదాయాన్ని రూ.170 కోట్లు వెచ్చించి నిర్మించారు. ఇందులో 55 కోర్టు గదులు, న్యాయమూర్తుల కోసం 55 ప్రత్యేక చాంబర్లు, సమావేశం గదులు, రికార్డు గదులు, సముదాయం ఆవరణలో 1,000 వాహనాలు నిలిపేందుకు సువిశాల పార్కింగు ప్రాంగణం, గ్రంథాలయం, బ్యాంకు, తపాలా కార్యాలయం సదుపాయాలు కల్పించారు.


కోర్టు భవన సముదాయాన్ని ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


అధునాతన జ్యుడీషియల్ కోర్టు భవన సముదాయం

పార్కింగ్ సౌకర్యం కల్పించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ బస్సుల యజమానులు

జయపురం: జయపురం నూతన ఓఎస్‌ఆర్టీసీ బస్టాండ్ నుంచి గాంధీ కూడలి వరకు 26వ జాతీయ రహదారిలో బస్సుల పార్కింగ్‌పై అధికారులు తీసుకున్న నిర్ణయంపై మరోసారి ఆలోచించాలని కోరారు. కలెక్టర్‌ను ప్రైవేట్ బస్సుల యజమానులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారుల నిర్ణయంలో ఎటువంటి మార్పు ఉండదని, జాతీయ రహదారిలో బస్సులు నిలపటం వలన ట్రాఫిక్ సమస్యతోపాటు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రైవేట్ బస్సులు ఓఎస్‌ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిపేందుకు అన్ని సౌకర్యాలు కల్పించటం జరిగిందని నవరంగపూర్, కొరాపుట్, మల్కనగిరి బస్సు ఓనర్స్ ప్రతినిధులకు సూచించారు. బైపాస్ రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదిన జరుగుతున్నాయని, రోడ్డు నిర్మాణం పూర్తయితే భారీ వాహనాలు బైపాస్ రోడ్డులో తరలించటం జరుగుతుందన్నారు. బైపాస్ రోడ్డు పూర్తయి భారీ వాహనాలను ఆ మార్గంలో తరలించిన తరువాత జాతీయ రహదారిలో పార్కింగ్ విషయాన్ని ఆలోచిస్తామన్నారు. ఓఎస్‌ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రైవేట్ బస్సుల ప్రవేశానికి రూ.50లకు బదులు రూ.25లు చేసే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. ప్రైవేట్ బస్సుల టికెట్ కౌంటర్ల తరలింపుపై ఓనర్స్, ప్రతినిధులతో కలెక్టర్ చర్చించారు. కలెక్టర్‌ను బస్సు యజమానుల సంఘ కార్యదర్శి నరేంద్ర కుమార్ మహంతి నేతృత్వంలో అధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం పాత్రో, ప్రశాంత కుమార్ పాణిగ్రహి, షేక్ కాశిం, బనబిహారి త్రిపాఠీ, బిజయ కుమార్ రథ్, తిరుపతి పాణిగ్రహి, అశోక్ కుమార్ పాత్రో తదితరులు కలిశారు.

మహాలక్ష్మి పూజలు ప్రారంభం


కలశాలతో శుద్ధ జలాలను తీసుకువస్తున్న భక్తులు

రాయగడ: జిల్లాలోని మునిగుడలో గల పాయికొవీధిలో ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా మహాలక్ష్మి పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు సమీపంలో గల నాగావళి నది నుంచి శుద్ధ జలాలను తీసుకువచ్చి వేదిక వద్ద నిలిపారు. ఊరేగింపుగా వెళ్లిన ప్రజలు అమ్మవారి పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటుగా జరిగే ఈ పూజల్లో ప్రతీ రోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత 24 ఏళ్ల నుంచి ఈ పూజలు నిర్వహిస్తుండటం విశేషం.

నేలను రక్షించుకుందాం

- జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్


మల్కన్‌గిరి: రైతులకుకు వ్యవసాయ మట్టి పరీక్షల కార్డులను అందజేస్తున్న అధికారులు


మల్కన్‌గిరి: వేదికపై అతిథులు

పర్లాకిమిడి: మట్టిని కలుషితం చేయకుండా సంరక్షించడం ద్వారా భావితరాలకు మేలు చేకూర్చుదామని జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హాల్‌లో గురువారం ప్రపంచ మట్టి దినోత్సవాన్ని నిర్వహించగా.. రాజేంద్ర మింజ్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా.. జిల్లా ముఖ్య వ్యవసాయశాఖ అధికారి ఎ.రాంప్రసాద్ పాత్రో అధ్యక్షత వహించారు. ఇతర అతిథులుగా ప్రాజెక్టు డైరెక్టర్, వాటర్ షెడ్, మట్టిసంరక్షణ శాఖ అధికారి సురేష్ కుమార్ పట్నాయక్, జిల్లా ఉద్యానవనాల శాఖ ఉపసంచాలకులు సుశాంత రంజన్ దాస్, ఆర్.ఉదయగిరి కృషి విజ్ఞాన కేంద్రం, పరిశోధకులు సంగ్రాం పరంగురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నేలతల్లిని కాపాడుకుందామన్నారు. అలాగే రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో మట్టి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ముఖ్యవ్యవసాయ శాఖ అధికారి రాంప్రసాద్ పాత్రో అన్నారు. వర్షం నీటిని కూడా గిరిజన ప్రాంతాల్లో వాటర్ షెడ్ పథకాల ద్వారా నిల్వ చేయాలని జిల్లా మట్టిసంరక్షణ అధికారి సురేష్ కుమార్ పట్నాయక్ అన్నారు. ఈ సందర్భంగా మట్టి సంరక్షణపై నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలైన వివిధ పాఠశాలల విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలను ఏడీఎం రాజేంద్ర మింజ్ అందజేశారు. జిల్లాలోని ఎనిమిది మంది ఉత్తమ మట్టి సంరక్షణ రైతులకు మట్టి స్వస్థ్య కార్డులను పంపిణీ చేశారు.

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రపంచ భూమి దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. మాతృభూమిని ఏలా రక్షించాలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధిలరంజాన్ మహలిక్ వివరించారు. అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ పాన్ భూమి ప్రాధాన్యాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా 30 మంది రైతులకు భూసార పరీక్షల కార్డులను అందజేశారు.


పర్లాకిమిడి: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉద్యానవన ఉపసంచాలకులు సుశాంత రంజన్ దాస్


పర్లాకిమిడి: మాట్లాడుతున్న ఏడీఎం రాజేంద్ర మింజ్

11 నుంచి ధాన్యం మండీల ప్రారంభం


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

జయపురం: ఈ నెల 11వ తేదీ నుండి ధాన్యం కొనుగోలుకు నిర్దేశించబడిన మండీలు ప్రారంభం కానున్నాయి. గురువారం సాయంత్రం ఉమ్మిరి సమీపంలో గల రెగ్యులేటింగ్ మార్కెటింగ్ కమిటీవారు మండీ సచేతన, శిక్షణ శిబిరం నిర్వహించారు. జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శౌశ్యా రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాణ్యమైన ఎఫ్ఏక్యూ ధాన్యంపై అధికారులు వివరించారు. ఎఫ్ఏ క్యూ ధాన్యం తీసుకు రండి క్వింటాకు రూ.3,100 తీసుకు వెళ్లండి, ధాన్యంలో నాణ్యత లేకపోతే పేడీ క్లీనింగ్ యంత్రం ద్వారా క్లీన్ చేసి ఆమేరకు ధర చెల్లిస్తామని వెల్లడించారు. 17 శాతం కన్నా తక్కువ, కలుప గింజాలు గల ధాన్యాన్ని ఎఫ్ఏ క్యూ ధాన్యంగా గుర్తించటం జరుగుతుందన్నారు. రైతులు ఎఫ్ఏక్యూ ధాన్యం తీసుకురాకపోతే వారి ధాన్యం పక్కన పెట్టి పేడీ క్లీనింగ్ మిషన్ ద్వారా క్లీనింగ్ చేయించి ఖరీదు చేస్తామన్నారు. పేడీ క్లీనింగ్ మెషిన్‌లు జయపురం, బొరిగుమ్మ, బొయిపరిగుడతోపాటు మరో 3 మండీలలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు ఏజంట్లకు ఎఫ్ఏక్యూ ధాన్యంపై శిక్షణ ఇచ్చారు. డి.ఎస్.సి.ఎస్ భీమసేన్ సాహు, ఆర్.ఎం.సి కార్యదర్శి దుర్గా ప్రసాద్ చురియ, ఆర్.ఎం.సి డైరెక్టర్ దేవేంద్ర బాహిణీపతి, కృష్ణ చంద్ర నేపక్, బిజయ పండా, గోపాలరావు, నవీణ నాయక్, అరుణ భటమిశ్ర తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవ వేదికపై రాష్ట్రపతి, గవర్నర్, ప్రముఖులు



ఆకట్టుకున్న చేనేత వస్త్రధారణ


చేనేత వస్త్ర ధారణతో వ్యవసాయ శాస్త్రవేత్తలు


చేనేత వస్త్రధారణతో స్నాతకోత్సవంలో పట్టాలు సాధించిన ఉత్తీర్ణ విద్యార్థులు

ఒడిశా వ్యవసాయ సాంకేతిక విశ్వవిద్యాలయం 40వ స్నాతకోత్సవం ప్రాంగణంలో సరికొత్త వస్త్రధారణ అందరి దృష్టిని విశేషంగా ఆకట్టుకుంది. స్నాతకోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక వస్త్రధారణ పాత విషయమే అయినా తొలిసారిగా చేతితో నేసిన వస్త్రాలతో అతిథులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, పరిశోధకులు, ఉత్తీర్ణులు, ఇతరేతర ప్రముఖులు హాజరయ్యారు. స్వదేశీ వస్త్రధారణ భారతీయ చేనేత విలువల్ని ప్రతిబింబించడంతో వర్ధమాన, భావితరాల్లో వీటి వినియోగం పట్ల మక్కువ పెంచుతుందనే దృక్పథంతో ఓయూఏటీ స్నాతకోత్సవంలో తొలి సారిగా ఈ డ్రెస్‌కోడ్ ఆవిష్కరించింది. రాష్ట్ర వ్యవసాయ, రైతు సాధికారిత శాఖ ప్రముఖ కార్యదర్శి డాక్టరు అరవింద కుమార్ పాడి సృజనాత్మక ప్రతిపాదన ఇలా కార్యరూపం దాల్చి వినూత్నతకు అద్దం పట్టింది.

- భువనేశ్వర్


అధునాతన వస్త్రధారణతో అధ్యాపక వర్గం

ఢిల్లీ చేరిన పోలవరం పంచాయితీ


లీనా నందన్‌కు ఫిర్యాదు చేస్తున్న బీడీ నాయకులు

కొరాపుట్: ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్ట్‌పై ప్రతిపక్ష బిజూ జనతా దల్ పార్టీ తన అసమ్మతిని ఢిల్లీకి వినిపించింది. పార్టీ సీనియర్ నాయకుడు దేవి మిశ్ర నేతృత్వంలో నబరంగ్‌పూర్, కొరాపుట్, మల్కనగిరి నాయకులతో కూడిన బృందం దేశ రాజధానిలో ఫిర్యాదులు చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం ఏకపక్షంగా జరుగుతుండటంతో ఒడిశాకి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర పర్యావరణ, అటవీ, ప్రకృతి మార్పులు శాఖా కార్యదర్శి లీనా నందన్, అటవీ శాఖ అదనపు పరిపాలక కార్యదర్శి నబజిత్ కపూర్, జాతీయ షెడ్యూల్ ట్రైబల్ కమిషన్ ఛైర్మన్ అంతర్‌సింగ్ ఆర్యకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు రమేష్ చంద్ర మఝి, పార్టీ అధికార ప్రతినిధి భృగు భక్షిపాత్రో, మాజీ ఎంపీ ప్రదీప్ మఝి, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, మాజీ ఎమ్మెల్యే మానస్ మడ్కామి తదితరులు పాల్గొన్నారు.

20 వేల గంజాయి మొక్కలు ధ్వంసం


గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పుట్టాసింగి పంచాయతీ పరిధిలోని పిండాగుడి ప్రాంతంలో సాగవుతున్న గంజాయి సాగును పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. అక్రమంగా గంజాయి సాగవుతోందనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో తొమ్మిది ఎకరాల్లో సాగవుతున్న 20 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి వాటికి నిప్పుపెట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


గంజాయి మొక్కలను తగలబెడుతున్న పోలీసులు

పర్లాకిమిడి చేరుకున్న ఉత్సవ జ్యోతి


పర్లాకిమిడి ఫారెస్టు గేటు వద్ద స్వాగతం పలుకుతున్న ఏడీఎం రాజేంద్ర మింజ్

పర్లాకిమిడి: గజపతి స్టేడియంలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న గజపతి ఉత్సవాలకు సంబంధించి పవిత్ర మహేంద్రగిరి పర్వతంలోని కుంతీ మందిరం వద్ద మాసాల్ జ్యోతిని వెలిగించారు. అక్కడి నుంచి కోయిపూర్, జిరంగో, మండలసాయి, రామగిరి, ఛెలిగడ, ఆర్.ఉదయగిరి, ఖోజురిపద, రాయఘడ, మచ్చమర, పర్లాకిమిడి ఫారెస్టు గేటువద్దకు చేర్చారు. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు అధికారి పృథ్వీరాజ్ మండళ్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి తదితరులు మాసాల్ జ్యోతికి స్వాగతం పలికారు. అక్కడి నుంచి తీన్‌మార్ బ్యాండ్‌తో బిజూ కళ్యాణ మండపం వరకూ శోభాయాత్ర జరిపారు. అనంతరం శ్రీజగన్నాథ మందిరానికి చేరుకుని పూజలు నిర్వహించారు. ఉత్సవ జ్యోతిని గజపతి స్టేడియంలో అందుబాటులో ఉంచారు.


పవిత్ర మహేంద్రగిరిలోని కుంతీ మందిరం నుంచి బయలుదేరిన ఉత్సవ జ్యోతి

క్లుప్తంగా

ఖోఖోలో ప్రథమస్థానం

● పాలకొండ విద్యార్థినుల ఘనత



ఖోఖోలో ప్రథమ స్థానం కైవశం చేసుకున్న పాలకొండ క్రీడాకారిణులు హర్షిత, జాహ్నవి

పాలకొండ రూరల్: న్యూఢిల్లీలోని నోయిడాలో ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకూ జరిగిన డీఏవీ జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాలకొండ మండలంలోని అన్నవరం డీఏవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. దాదాపు 800 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో ఖోఖో విభాగంలో స్థానిక విద్యార్థినులు ఎన్నిహర్షిత, ముంజేటి జాహ్నవి ప్రథమస్థానం దక్కించుకున్నారు. ఈ మేరకు సదరు క్రీడాకారిణులకు తర్ఫీదు అందించిన వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మునాయుడు, విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఎం.వెంకటరామిరెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

సంకిలి సుగర్ ప్యాక్టరీపై డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో నెలకొల్పిన ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు రేగిడి మండలంలోని అప్పాపురం మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు గురువారం ఆన్‌లైన్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సంకిలి ఈఐడీ ఫ్యారీ సుగర్ ఫ్యాక్టరీతో పాటు అనుబంధ పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలు, కాలుష్యం వల్ల సంకిలి, చిన్నయ్యపేట, దేవుదల, పుర్లి, పురలిపేట, గోపింపేట, అప్పాపురం, మజ్జిరాముడుపేట, రేగిడి, ఆమదాలవలస, లక్ష్మీపురం, ఆడవరం, కొమెర తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సంకిలి పంచాయతీ సర్పంచ్ పట్టాభితో పాటు పాలకవర్గం ఈనెల 1న సీఎం గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదుచేసారని, ఈనెల 3న దేవుదళ గ్రామస్తులు విజయనగరం జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారని, అదే రోజున పుర్లి గ్రామస్తులు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రీజనల్ పొల్యూషన్ అండ్ కంట్రోల్ బోర్డు అధికారి బి.సరితకు దర్యాప్తు బాధ్యతలు అప్పగించగా ఆ అధికారి మాత్రం ఇంతవరకూ క్షేత్రస్థాయి పరిశీలన, తనిఖీ చేయలేదని, ఫిర్యాదులను పక్కన పెట్టేసి, ఫ్యాక్టరీ యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫ్యాక్టరీ వ్యర్థాలపై దృష్టిసారించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, ఫ్యాక్టరీ యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్న రీజనల్ పొల్యూషన్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

మూడు పశువుల వ్యాన్ల సీజ్



పశువులు తరలిస్తున్న వ్యాన్లతో పోలీస్‌లు

దత్తిరాజేరు: పశువులను అక్రమంగా తరలిస్తున్న మూడువ్యాన్‌లు పట్టుకుని సీజ్ చేసినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి గురువారం తెలిపారు. పార్వతీపురం నుంచి గజపతినగరానికి 26 పశువులను వ్యాన్లలో తరలిస్తుండగా పెదమానాపురం సంత వద్ద అడ్డుకుని యజమానులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

అంతర్రాష్ట దొంగ అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, తదితరులు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: విజయనగరంలోని తోటపాలెంలో నాలుగు ఇళ్లల్లో ఆగస్టు నెలలో దొంగతనాలకు పాల్పడిన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంతర్రాష్ట దొంగను గురువారం అరెస్టు చేసి 400 గ్రాముల వెండి వస్తువులను రికవరీ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఆగస్టు 20న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నాలుగిళ్లలో చోరీకి పాల్పడినట్లు బాధితులిచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా నేరానికి పాల్పడిన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐదా అలియాస్ ఈదు బఘెల్‌ను ఈ నెల 4న రాత్రి పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా సీసీఎస్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసుసిబ్బంది అదుపులోకి తీసుకుని, విచారణ చేయగా తోటపాలెంలోని నాలుగిళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. ఈ కేసుల్లో ప్రమేయమున్న మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసేందుకు గాలింపు చేపట్టామని సీఐ వివరించారు.

పరజపాడులో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు-కుందరతిరువాడ పంటపొలాల్లో గురువారం ఏనుగులు దర్శనమిచ్చాయి. ఆ గ్రామాల్లో అరటి, పామాయిల్ తోటలు ఉండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. బుధవారం అర్ధరాత్రి వెంకటరాజపురం గ్రామంలో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు ఏనుగులు చిందరవందర చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

సామాన్యుల బండికి ఎర్రజెండా

● వినపించని కూత ● విశాఖపట్నం నుంచి సాలూరుకు ఏదీ రైలు?
● రెండు నెలల క్రితం ట్రయల్‌రన్ ● 15 రోజుల్లోగానే వచ్చేస్తుందన్న కూటమి నాయకులు
● ఇప్పటికీ పట్టాలెక్కని పరిస్థితి ● రద్దీ మార్గంలో తరచూ పాసింజర్ సర్వీసులకు ఆటంకం

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో బొబ్బిలి, పార్వతీపురం, గుమడ, కూనేరు, జిమిడిపేట రైల్వే స్టేషన్ల మీదుగా వెళ్లే రైళ్లు అధికంగా ఉన్నాయి. సుమారు 15 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. కొరాపుట్ డీఎంయూ, రాయిపూర్ పాసింజర్ వంటి సామాన్యుల రైలు బండి సర్వీసులు తక్కువే. విశాఖపట్నం, విజయనగరంల మీదుగా బొబ్బిలి, పార్వతీపురం ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం నిత్యం రాకపోకలు సాగించే వారి సంఖ్య వేలల్లోనే ఉంటోంది. పాసింజర్ సర్వీసులు తక్కువగా ఉండడం..దానికితోడు బ్లాక్ వర్క్స్, ఇతర పనులంటూ తరచూ ఈ రైళ్లనే అధికారులు నిలుపుదల చేస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు వారం రోజులుగా డీఎంయూ, రాయగడ-గుంటూరు రైళ్లు పార్వతీపురం మార్గంలో నిలిపివేశారు. రాయిపూర్ పాసింజర్ సైతం అప్పుడప్పుడూ అన్నట్లే ఉంది. దీంతో వేరే మార్గం లేక బస్సులపైనే ప్రయాణికులు ఆధారపడుతున్నారు. సాక్షి, పార్వతీపురం మన్యం



రైళ్ల రద్దుతో పార్వతీపురం వెళ్లే ప్రయాణికుల ఇక్కట్లు

సామాన్యుల 'బండి'..ఉమ్మడి విజయనగరం జిల్లాకు దూరం జరుగుతూనే ఉంది. అత్యంత రద్దీగా ఉండే.. విశాఖపట్నం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు మార్గంలో రైళ్ల సంఖ్య తక్కువే. నిత్యం వ్యాపార, ఉద్యోగ, విద్య, ఇతర అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారితో పాటు.. ప్రయాణికులు సైతం ఈ మార్గంలో ఎక్కువగా రైలునే ఆశ్రయిస్తారు. ఇదిలా ఉండగా విజయనగరం నుంచి పార్వతీపురం వెళ్లాలంటే రోడ్డు మార్గంలో కనీసం 2.30 నుంచి 3 గంటలు పడుతుంది. మానాపురం గేటుతోపాటు..పారాది, సీతానగరం వంతెనల మీద ట్రాఫిక్ జామ్ అయితే ప్రయాణం ఒక్కోసారి నాలుగు గంటలకు చేరుకుంటుంది. ఈ ఇబ్బందులు లేకుండా ఇటుగా ప్రయాణించేవారెవరైనా ముందుగా ప్రాధాన్యమిచ్చేది రైలు ప్రయాణానికే. సమయంతోపాటు, డబ్బులూ ఆదా అవుతాయని ఆశ. ఇంతటి ప్రాధాన్యం గల మార్గంలో ఎక్స్‌ప్రెస్‌తోపాటు, పాసింజర్ రైళ్లు కూడా అంతంత మాత్రమే. అవి కూడా ఎప్పుడు



తిరుగుతాయో, ఎప్పుడు నిలిచిపోతాయో తెలియని పరిస్థితి. మూడో లైన్ వేసిన దగ్గర నుంచి తరచూ రెగ్యులర్‌గా నడిచే సర్వీసులను నిలిపివేయడం.. సమయం రీషెడ్యూల్ చేయడం పరిపాటిగా మారింది.

పట్టాలెక్కని సాలూరు బండి..

సాలూరుకు రైలుమార్గం ఉన్నప్పటికీ..నడిచే బళ్లు లేవు. గతంలో బొబ్బిలి నుంచి సాలూరుకు రైలు బస్సు నడిచేది. కోవిడ్ సమయం నుంచి దాన్ని కూడా నిలిపివేశారు. రైళ్లలో విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి వచ్చే వారు బొబ్బిలిలో దిగి..అక్కడి నుంచి బస్సుల్లో సాలూరు, మక్కువ, పాచిపెంట వంటి ప్రాంతాలకు చేరుకోవాల్సి వస్తోంది. సరకుల రవాణా నిమిత్తం సాలూరులో స్వాతంత్ర్యానికి ముందే రైలు మార్గం వేశారు. నష్టాల పేరుతో 2000వ సంవత్సరంలో స్టేషన్ మూతపడింది. ఆ తర్వాత స్థానికులు



సాలూరు రైల్వేస్టేషన్

ఎన్నోమార్లు రైలు సేవలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే నాటి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఎంపీ చొరవతో ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ట్రాక్ పునరుద్ధరణతో పాటు, ట్రయల్ రన్ కూడా పూర్తయింది. బండి నడిచే వేళలను కూడా రైల్వే అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత అది ముందుకు సాగలేదు. అక్టోబరు 5న మరోసారి ట్రయల్‌రన్ నిర్వహించారు. విశాఖపట్నం-విజయనగరం వరకు ప్రస్తుతం నడుస్తున్న 'మెము' రైలు(07468/07467- 67292/67291)ను బొబ్బిలి మీదుగా సాలూరుకు పొడిగించనున్నట్లు ప్రకటించారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోందని సాలూరు వాసులు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రితో పాటు, కూటమి నేతలు కూడా రోజుల వ్యవధిలోనే రైలు పట్టాలెక్కనుందని..అదిగో బండి వచ్చేస్తోందని హడావిడి చేశారు. ఇప్పటికి రెండు నెలలు గడుస్తున్నా..ఆ ఊసే లేదు. దీంతో సాలూరుతో పాటు, పరిసర ప్రాంత వాసులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇలా 'ట్రయల్స్'కే పరిమితం అవుతోంది తప్ప రైల్వే అధికారులు మాత్రం 'మెము' రైలును పట్టాలెక్కించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



ఎల్విన్‌పేట సర్కిల్ కార్యాలయంలో పర్యటిస్తున్న డీఐజీ గోపినాథ్ జెట్టి

గుమ్మలక్ష్మీపురం: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విలువైన జీవితాన్ని కాపాడుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి హితవు పలికారు. ఈ మేరకు గురువారం ఆయన ఎల్విన్‌పేట సర్కిల్ కార్యాలయంతో పాటు కురుపాం పోలీస్‌స్టేషన్‌లను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్‌కు ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదులు, కేసులు పరిష్కరిస్తున్న తీరు, శాంతిభద్రతలపై ఆరాతీశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాల వల్ల కలిగే అనర్థాలు, డిజిటల్ అరెస్టులు, సైబర్ దోపిడీల గురించి 'సంకల్పం' పేరుతో రేంజ్ పరిధిలో 3050 కార్యక్రమాల ద్వారా సుమారు 2 లక్షల మందికి అవగాహన కల్పించినట్లు చెప్పారు. పొరపాటున సైబర్ క్రైమ్‌కు ఎవరైనా గురైతే టోల్ ఫ్రీ నంబర్ 1930కు తక్షణమే ఫోన్ చేసి సమాచారం అందిస్తే బ్యాంకు ఖాతాలోని నగదు పోకుండా బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేయవచ్చన్నారు. వ్యక్తిగత సమాచారం అపరిచితులతో, లేదా సోషల్‌మీడియాతో పంచుకోకూడదని స్పష్టం చేశారు. ఉద్యోగాల పేరుతో దోపిడీలు జరుగుతున్నాయని.. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఉద్యోగాలకు ముందస్తు నోటిఫికేషన్ వెలువడకుండా భర్తీ చేయడం కుదరదన్న సంగతిని నిరుద్యోగులు గ్రహించాలన్నారు. మైనర్లు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే తీవ్రమైన నేరంగా పరిగణించి కఠినంగా శిక్షించనున్నట్లు హెచ్చరించారు. రేంజ్ పరిధిలో మావోయిస్టుల ప్రభావం లేదని, సరిహద్దుల్లో తమ బలగాలు రెగ్యులర్‌గా కూబింగ్ నిర్వహిస్తున్నాయని తెలిపారు.

తల్లిదండ్రుల కష్టాన్ని వృథా చేయవద్దు

తల్లిదండ్రులు పిల్లల్ని ఎంతో కష్టపడి చదివిస్తుంటారని, వారి కష్టాన్ని వృథా చేయవద్దని డీఐజీ గోపీనాథ్ జెట్టి విద్యార్థులతో అన్నారు. ఈమేరకు తన పర్యటనలో భాగంగా గుమ్మలక్ష్మీపురంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 'సంకల్పం' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి..కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని..తద్వారా తల్లిదండ్రులు, గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. పర్యటనలో ఆయన వెంట పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, ఎల్విన్‌పేట, చినమేరంగి సీఐలు బి.హరి, తిరుపతిరావు, ఎస్సైలు బి.శివప్రసాద్, పి.నారాయణరావులతో పాటు ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ ఉన్నారు.

గంజాయిపై ఉక్కు పాదం



పాలకొండ: మాట్లాడుతున్న డీఐజీ

పాలకొండ: గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామని డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. ఈ మేరకు గురువారం పాలకొండలోని డీఎస్పీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంపై పూర్తి నిఘా ఉంచామని తెలిపారు. యువత మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని హితవు పలికారు. ఎక్కడ పట్టుబడినా కేసులు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. సరిహద్దు ప్రాంతాల్లో నిత్యం నిఘా ఉంటుందని, తమ సిబ్బందికి గంజాయి నియంత్రణపై ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. యువతకు అవగాహన కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఆయనతో పాటు డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళి ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సీసీ కెమెరాలు బిగించేందుకు వచ్చిన వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. కురుపాంలో గురువారం జరిగిన ఈ ప్రమాదం వివరాల్లోకి వెళ్తే..కురుపాం సమీపంలోని కోటినగర్ లే అవుట్‌లో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు వచ్చిన పాలక మురళీధర్..విద్యుత్ వైర్లు పాఠశాల భవనం పైభాగాన ఉన్నట్లు గమనించకుండా పైకి ఎక్కడంతో మెడపై విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో మెడ, మర్మాంగం, కాళ్లు కాలిపోయాయి. గమనించిన సిబ్బంది తక్షణమే కురుపాం సీహెచ్‌సీకి తీసుకువెళ్లి ప్రాథమిక వైద్యసేవలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. మురళీధర్ స్వగ్రామం బత్తిలి కాగా..పార్వతీపురంలోని కొత్తవలసలో ఉంటూనే సీసీ కెమెరాలు బిగించే పనిచేస్తున్నాడు.

ఐస్‌క్రీం వ్యాన్ బోల్తా

వీరఘట్టం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారు జామున ఓ ఐస్‌క్రీం వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడి రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోగా ఎల్‌టీ, హెచ్‌టీ లైన్‌లు తెగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

మెగా పేరెంట్స్‌డే మీటింగ్‌ను విజయవంతం చేయాలి

● కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: డిసెంబర్ 7న నిర్వహించే మెగా పేరెంట్స్‌డే మీటింగ్‌ను విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరెంట్స్ డే మీటింగ్‌ను విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరయ్యేలా ఆహ్వానాలు పంపించాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకూడదు

ధాన్యం కొనుగోలులో ఏ ఒక్క రైతు ఇబ్బంది తలెత్తకూడదని, ఎక్కడా సమస్యలు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్‌లతో సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఉపాధి కోసం వెళ్లి.. అనంతలోకాలకు

● బెంగళూరులో పాలకొండ యువకుడి మృతి



మృతుడు ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

పాలకొండ: పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం వేరే రాష్ట్రానికి వెళ్లిన నిరుద్యోగిని మృత్యువు వెంటాడింది. పని వెతుక్కుని మీకు తోడుగా ఉంటానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లిన కొడుకు విగత జీవిగా మారడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. కనీసం 18ఏళ్ల కూడా నిండని ఆ యువకుడి మృతి స్థానికంగా కలిచివేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు పరిశీలిస్తే పాలకొండ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పప్పల సింహాచలం ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య రాజులు, కుమారుడు ప్రవీణ్‌కుమార్, కుమార్తె ఉన్నారు. కొడుకు ప్రవీణ్ కుమార్(17) ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగ వేటలో భాగంగా మూడు నెలల కిందట బెంగళూరు వెళ్లాడు. ఇటీవల ఒక ప్రైవేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం దొరకడంతో తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పి ఆనందంగా ఉండమన్నాడు. అక్కడే ఉంటూ ఉద్యోగం చేస్తున్న క్రమంలో రైల్వేలైన్ పట్టాలు దాటుతుండగా వెనుకనుంచి వచ్చిన ట్రైన్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మరణించాడు.

కిల్కారీ సేవలపై శిక్షణ

పార్వతీపురంటౌన్: కిల్కారీ సేవలపై జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం శిక్షణ నిర్వహించారు. డీఐఓ డాక్టర్ ఎం. నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.కేవీఎస్ పద్మావతి ఆధ్వర్యంలో ఆశ నోడల్ అధికారులకు నిర్వహించిన సమావేశంలో కిల్కారీ మొబైల్ సేవలపై స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ పి.రమేష్ కిల్కారీ సేవల వినియోగం, ఆవశ్యకతపై శిక్షణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం గర్భిణి, శిశు ఆరోగ్య శ్రేయస్సుకు కిల్కారీ సేవలు ప్రవేశపెట్టిందని, మొబైల్ ద్వారా అవసరమైన ఆరోగ్య సమాచారం వారికి అందజేయనున్నట్లు తెలిపారు. గర్భిణి నమోదైనప్పటి నుంచి ప్రసవం పూర్తయ్యే వరకు, బిడ్డ ఏడాది వయస్సు వరకు గర్భిణిగా నమోదైన సమయంలో ఇచ్చిన ఫోన్ నంబర్ కు వారి ఆరోగ్యానికి అవసరమైన సమాచారం 01244451660 కిల్కారీ నంబర్ ద్వారా వస్తుందని, ఒక వేళ ఆ సమయంలో ఫోన్‌కు అందుబాటులో లేకపోతే గర్భవతులు కిల్కారీ సేవలు తిరిగి వినాలంటే 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. కిల్కారీ సేవలపై ఆశ కార్యకర్తల ద్వారా గర్భవతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్స్, కరపత్రాలను ప్రదర్శించారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారులు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, డీపీఎంఓ డా.రఘు కుమార్, నోడల్ అధికారి డా.వినోద్, డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, డీపీఓ లీలారాణి, డీసీఎం విజయలత, సూపర్‌వైజర్ జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

● గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

పార్వతీపురం: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖామంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా, మండల అధికారులతో రెవెన్యూ సదస్సులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 6 నుంచి జనవరి 8 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 70శాతం వరకు భూ సమస్యలపైనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో గ్రామాల్లోనే సదస్సులను నిర్వహించి సమస్య పరిష్కారానికి చొరవ చూపించనున్నామని చెప్పారు. రెవెన్యూ సదస్సులకు జాయింట్ కలెక్టర్ సమన్వయకర్తగా ఉంటారని, సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లను వారి డివిజన్, మండలాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేయాలని సూచించారు. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్ఓ, మండల సర్వేయర్ రిజిస్ట్రేషన్‌శాఖ ప్రతినిధి అటవీ, దేవాదాయశాఖ, వక్ఫ్‌బోర్డు సిబ్బంది సదస్సుల్లో పాల్గొనాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. మెగా పేరెంట్స్‌డే కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

బహుళ రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాలి

రాష్ట్ర ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలపై దృష్టిసారించాలని, వాటిపై అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ఒకే భూమిపై బహుళ రిజిస్ట్రేషన్లపైన దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ గ్రామ కంఠాలు, ఇనామ్ భూముల సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సదస్సుల్లో ఫిర్యాదుల స్వీకరణకు కౌంటర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. సమావేశంలో పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, పాలకొండ సబ్‌కలెక్టర్ ఎస్.యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ కె.హేమలతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విరాళాలను అందించాలి



పతాక నిధికి విరాళం ఇస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలను అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సాయుధదళాల పతాక దినోత్సవాన్ని జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పతాక నిధి ఫ్లాగ్‌ను ప్రారంభించి జిల్లాలోని సైనికులు, మాజీ సైనికులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తొలి చందాను పతాక నిధికి అందజేసి ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తిని నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత సైనిక దళాలు మొక్కవోని దీక్షతో చూపిన దేశ భక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశమంతా గర్విస్తుందన్నారు. కార్గిల్ పోరాటంలో తాజ్ హోటల్ దురాక్రమణ సమయంలో సైనికుల ధైర్య సాహసాలపై యావత్తు జాతి గర్వించిందన్నారు. దేశంకోసం ఎంతో మంది సైనిక సోదరులు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రాణత్యాగం చేసిన అమరులు ఎంతో మంది ఉన్నారన్నారు. సైనికులకు మనమంతా ఎంతో రుణపడి ఉన్నామన్నారు. వారి త్యాగాలను ఎవరూ విలువ కట్టలేరన్నారు. పతాక నిధికి వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, పౌరులు విరాళాలను అందించాలని కోరారు. ఈనెల 7న ఎస్ఎస్‌సీ విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వెళ్లి విరాళాలు స్వీకరిస్తారని, ఈ విరాళాలకు ఆదాయ పన్ను రాయితీ కూడా వస్తుందన్నారు. విరాళాలు అందించే వారు ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 52065221666, ఐఎఫ్ఐసీ కోడ్ ఎస్‌బీఐఎన్ 00209818కి చందాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

● పోస్టర్ ఆవిష్కరించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా 32వ మహాసభలు ఈనెల 21, 22 తేదీలలో గజపతినగరంలో నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎల్‌బీజీభవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం కేరళలోని తిరువనంతపురంలో స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే లక్ష్యాలతో ఏర్పడిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విజయనగరం జిల్లాలో విద్యారంగ సమస్యల మీద అలుపెరగని పోరాటం చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా కొన్నేళ్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, మెడికల్ కళాశాల నిర్మాణం వేగవంతం చేయాలని, ప్రతిమండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, నియోజకవర్గ కేంద్రాల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులందరినీ ఏకం చేసి ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తోందని తెలిపారు. వీటితో పాటు సంక్షేమ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థుల కోసం మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, హాస్టల్ విద్యార్థులను ఏకం చేసి పోరాడుతున్నామన్నారు. గాలిలో దీపంలా ఉన్న విద్యారంగ పరిస్థితిని గాడిలో పెట్టాలని ప్రభుత్వాన్ని ఈ జిల్లా మహాసభల సందర్భంగా ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందన్నారు. గత సంవత్సరం చేసిన జిల్లా వ్యాప్త సైకిల్ యాత్ర, ఆమరణ నిరాహార దీక్షల ఫలితంగా జిల్లా విద్యా యంత్రాంగం విద్యార్థులకు పలు హామీలు ఇచ్చిందని అయితే వాటిలో కొన్ని హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదని విమర్శించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహాసభల సందర్భంగా ఆ డిమాండ్ల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ పోరాటం రూపొందిస్తామని తెలిపారు.

మహాసభలు జయప్రదం చేయాలి

జిల్లావ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నాయకులు గజపతినగరం మహాసభ ప్రాంతానికి వచ్చి జిల్లా విద్యారంగం అభివృద్ధి కోసం పలు తీర్మానాలు, సూచనలు చేస్తారని తెలిపారు. ఈ మహాసభల జయప్రదాయానికి జిల్లాలో ఉన్న మేధావులు, పెద్దలు, ప్రజలు, విద్యార్థులు తోడ్పడాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చినబాబు, రవికుమార్, వెంకీ, జిల్లా సహాయ కార్యదర్శులు సమీర, జగదీష్, రమేష్, శిరీష, మణికుమార్, జిల్లా కమిటీ సభ్యులు రూప, భారతి, కిరణ్, సోమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.